క్లుప్తంగా

ఆర్డీఓను కలిసిన రైతు సంఘం నాయకులు


ఆర్డీఓకు బొకే అందజేస్తున్న రైతు నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన డి.నాగజ్యోతిని శనివారం మర్యాదపూర్వకంగా ఆత్మకూరు రైతు సంఘం నాయకులు కలిశారు. పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తర్వాత డివిజన్‌లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్డీఓను కలిసిన వారిలో రైతు సంఘం నాయకులు మోమిన్ మునీర్ బాషా, కృషి పండ్ల తోటల సొసైటీ అధ్యక్షుడు బైరాపురం మహబూబ్‌బాషా, రైతులు ముసలమడుగు నబీసా, మీసాల మాబు, దుబ్బలింగమూర్తి, చెవిటి ఇబ్రహీం, మారుసగారి ముర్తుజా, మాలిక్ ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి


సూచనలు చేస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: ప్రజలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని ముష్టపల్లి గ్రామంలో శనివారం 104 వైద్యసేవల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలకు పొగాకు వాడకం ద్వారా వచ్చే వ్యాధులు, లక్షణాలు, చికిత్స తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో బైర్లూటీ సీహెచ్‌ఓ అహ్మద్, ఆరోగ్య కార్యకర్తలు ఇందిర, విశ్వనాథ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రవి, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి


సూర్యనారాయణ

వెలుగోడు: మండల రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వెలుగోడు పట్టణ రైతు సంఘం అధ్యక్షుడు చెలిమళ్ల సూర్యనారాయణ అన్నారు. ఈయనను శనివారం రైతులు పట్టణ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలో భూములు విస్తీర్ణం ఎక్కువ కాబట్టి పంట పొలాల రస్తాలకు సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు, కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో పూర్తి చేస్తానన్నారు. సంఘం ఉపాధ్యక్షుడిగా మిద్దె రహిమాన్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు


సమ్మర్ స్టోరేజ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని మల్యాల గ్రామ సమీపంలో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, పంపింగ్ మోటార్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్లోరినేషన్ చేసిన నీటినే ప్రజలకు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబి, ఎస్‌ఐ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి



ఓటు నమోదుపై యువతకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందికొట్కూరు: 18 ఏళ్లు నిండిన యువకులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శనివారం పట్టణంలోని బసిరెడ్డి డిగ్రీ కళాశాలలో యువకులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధుసూధాకర్, సీనియర్ అసిస్టెంట్ కళాశాలి, తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలంలో శివలింగాకారంలో దీపాలు వెలిగించిన భక్తులు



స్వామి దర్శనం కోసం.. మహానందిలో క్యూలో భక్తులు, కొత్తపల్లి.. ఆకాశదీపం వెలిగిస్తున్న దృశ్యం

మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం ప్రారంభంకావడంతో శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. శనివారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని దీపాలు వెలిగించి పూజలు చేశారు. శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల పరిధిలోని ఆలయాల్లో కార్తీక శోభ ఉట్టిపడింది. ప్రముఖ శైవక్షేత్రాలైనా శ్రీశైలం, మహానందికి భక్తులు పోటెత్తారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ఆలయాల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. రద్దీ నేపథ్యంలో మహానందిలో శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి దర్శనానికి రెండు గంటలు పట్టింది.

– శ్రీశైలం టెంపుల్/మహానంది/కొత్తపల్లి


ఉమా మహేశ్వరాలయంలో శివలింగానికి హారతి ఇస్తున్న అయ్యప్ప స్వామి భక్తులు


శివోహం.. శ్రీశైలంలో దీపాలు వెలిగించి పూజిస్తున్న భక్తులు

భక్తులకు విస్తృత ఏర్పాట్లు

- ఎలాంటి లోపం లేకుండా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి చేపట్టాలి
- కార్తీక మాసోత్సవాల ఏర్పాట్ల పరిశీలనలో ఇన్‌చార్జ్ ఈఓ

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం శ్రీశైల మహాక్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి ఇ.చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం ఆయన క్షేత్ర పరిధిలోని ఆలయ మాఢవీధులు, ఆలయ పుష్కరిణి, అన్నప్రసాద వితరణ, పాతాళగంగ, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఆలయ ఉత్తర మాఢవీధి, గంగాధర మండపం వద్ద భక్తులు కార్తీక దీపాలను వెలిగించుకునేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోపాలు లేకుండా పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పుష్కరిణి వద్ద లైటింగ్, విద్యుదీపాలంకరణ అకర్షణీయంగా ఉండాలని ఆదేశించారు. పాతాళగంగ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలని చెప్పారు. ఈ పరిశీలనలో దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.నరసింహారెడ్డి, ఏఈలు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.



క్షేత్ర పరిధిలో కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఈఓ, ప్రత్యేక విధులపై పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ రామాంజి నాయక్

భారీ పోలీసు బందోబస్తు

శ్రీశైలం: కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. శనివారం ఉదయం శ్రీశైలంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో జరిగిన సమావేశంలో కర్నూలు, నంద్యాల, నందికొట్కూరు తదితర నియోజకవర్గాల నుంచి సుమారు 300 మంది పోలీసులు ప్రత్యేక విధులపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కూడళ్లు, శ్రీశైలానికి వచ్చే రహదారి ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని వారికి దిశ దిశ నిర్దేశం చేయాలని పోలీసు సిబ్బందిని సూచించారు. దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూడా ప్రత్యేక విధులపై నైపుణ్యం గల పోలీసులను నియమిస్తున్నామని అన్నారు. ఇప్పుడు ఎక్కడ, ఎలాంటి సంఘటన జరిగినా వైర్‌లెస్ సెట్‌ల ద్వారా వెంటనే సమాచారం సంబంధిత అధికారులకు తెలియజేయాలని చెప్పారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ప్రసాద్‌రావు, చంద్రబాబు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

భజనలు ప్రారంభం

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో దేవస్థానం శివచతుస్సప్తాహ భజనలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా శనివారం కార్తీకమాసోత్సవాల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన ప్రారంభ పూజల్లో ఇన్‌చార్జ్ ఈఓ ఇ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. ముందుగా అర్చకులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా చండీశ్వరస్వామివారికి విశేషపూజలు జరిపించారు. అనంతరం శివప్రణవ పంచాక్షరీనామ అఖండ భజన ప్రారంభించారు. ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన రెండు భజన బృందాలకు, కర్ణాటకకు చెందిన నాలుగు భజన బృందాలకు అవకాశం కల్పించారు.


శివచతుస్సప్తాహ భజనల ప్రారంభ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

జూపాడుబంగ్లా: మండలకేంద్రం జూపాడుబంగ్లాలోని మోడల్‌స్కూల్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.సానియామీర్జా, ఎస్.ఫాతిమాబీలు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో అండర్–19 విభాగంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వాలీబాల్, ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ రమేష్, పీఈటీ పద్మమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.


రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీ

ఘనంగా సమాధుల పండుగ

నందికొట్కూరు/కొత్తపల్లి: నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవ సోదరులు శనివారం సమాధుల(ఆత్మల) పండుగను ఘనంగా నిర్వహించారు. మృతి చెందిన వ్యక్తుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ శ్మశానవాటికలకు చేరుకుని సమాధులను రంగులు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి కొవ్వొత్తులు వెలిగించారు. బతికిన కాలంలో చిన్న చిన్న తప్పులు చేసి మృతి చెందిన వ్యక్తులు స్వర్గానికి, నరకానికి మధ్యలో ఉండిపోతారని అటువంటి వారి ఆత్మలు దైవ సన్నిధికి చేరడానికి ప్రతి ఏటా నవంబర్ 2వ తేదీన ఆత్మల దినోత్సవం జరుపుకుంటున్నట్లు పాస్టర్లు తెలిపారు. నందికొట్కూరు, కొత్త పల్లి మండలాల్లో క్రైస్తవులు కుటుంబసభ్యులతో కలిసి సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


నందికొట్కూరులో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

రహదారులను అభివృద్ధి చేస్తాం

నంద్యాల(అర్బన్): దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేటు వద్ద మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ (గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమం కింద రహదారి మరమ్మతు పనులను జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు గుంతలు లేని రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగానే నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేటు నుంచి శ్రీనివాసనగర్ జంక్షన్ వరకు గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రహదారుల్లోని గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం రూ.4.57 కోట్లను మొదటి విడతగా మంజూరు చేసిందన్నారు. వచ్చేఏడాది జనవరి 15వ తేదీలోపు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు.

అది కుష్మాండ పూజ

నందికొట్కూరు: కొత్తపల్లి మండలం శివపురం గ్రామంలోని కొలనుభారతి దేవి ఆలయంలో గురువారం సాయంత్రం భక్తులు కూష్మాండపూజ నిర్వహించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి రామలింగారెడ్డి తెలిపారు. ఆలయ ఆవరణలో కొందరు వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించారంటూ జరిగిన దుష్ప్రచారం నేపథ్యంలో విచారణ చేపట్టారు. నంద్యాలకు చెందిన భక్తులను విచారించగా అవి క్షుద్ర పూజలు కావని పూర్వం నుంచి సంప్రదాయ బద్ధంగా కార్తీక అమవాస్య రోజు నిర్వహించే కూష్మాండ పూజ అని పేర్కొన్నారు. దీని వల్ల అనారోగ్యాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని భక్తుల నమ్మకమన్నారు.

హాస్టల్‌వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్న మోడల్‌స్కూల్ హాస్టల్ వార్డెన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడల్‌స్కూల్ హాస్టల్ విద్యార్థినుల పట్ల అఘాయిత్యానికి పాల్పడిన వార్డెన్‌పై ఇప్పటిదాకా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే వార్డెన్ ఉంటే తాము హాస్టల్లో ఉండమని విద్యార్థులు వెళ్లిపోయారన్నారు.

నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన పథకం కింద నిరుద్యోగులైన యువతీ, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ఏపీఓ గౌరీబాయి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని సి.క్యాంపు అమ్మ హాస్పిటల్ సమీపంలో ఉన్న విజయదుర్గా కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయస్సు ఉండి పది, ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు 90రోజులపాటు కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

పగిడ్యాల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. శనివారం రాత్రి లక్ష్మాపురం అంచె వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ తదితర వాహనదారులు తప్పనిసరిగా వాహన రికార్డులు కలిగి, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, సీట్‌బెల్ట్ పెట్టుకుని రోడ్డుపై ప్రయాణం సాగించాలన్నారు. అతివేగం ప్రమాదకరమన్నారు. ఆటో డ్రైవర్లు ఆటో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామన్నారు. ఆటోల్లో కలప, చౌకదుకాణం బియ్యం, మద్యం, నాటుసారా, గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలను సరఫరా చేస్తే ఉపేక్షించమన్నారు. వాహన తనిఖీలో రికార్డులు లేకుండా పట్టుబడిన వాహనాలకు జరిమాన విధించారు. సీఐ వెంట ముచ్చుమర్రి ఎస్‌ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.


వాహనదారులను హెచ్చరిస్తున్న రూరల్ సీఐ సుబ్రమణ్యం

మిత్ర పురుగులతో పంటలకు మేలు


అంతరపంటలపై రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి

మహానంది: మిత్రపురుగులతో పంటలకు మేలు జరుగుతుందని, ఇందుకోసం రైతులు పొలంగట్ల వెంట బంతి, చామంతి పూల మొక్కలతో పాటు ఆవాలు, నువ్వుల లాంటి వాటిని వేసుకోవాలని వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి సూచించారు. నందిపల్లె గ్రామంలో శనివారం పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు సేంద్రీయ పద్ధతుల ద్వారా సాగు చేసి పండించే పంటల దిగుబడికి మార్కెట్‌లో మంచి ఆదరణ, డిమాండ్ ఉంటుందన్నారు. పంటల సాగులో పురుగుల సంఖ్య, తీవ్రతను గుర్తించి అవసరమైన మేరకు మాత్రమే కొద్దిపాటి మోతాదులో రసాయనిక ఎరువులు వాడాలన్నారు. వీటి స్థానంలో జీవామృత, వృక్ష సంబంధ కషాయాలను వాడటం ద్వారా కీటకాలను తగ్గించుకోవచ్చని, తద్వారా రసాయనిక ఎరువుల వాడకం అవసరం ఉండదన్నారు.

11న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నంద్యాల(అర్బన్): దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 11న పట్టణంలోని ముల్లాన్ పేట మున్సిపల్ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబిహా పర్వీన్ శనివారం తెలిపారు. మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జీవిత చరిత్ర, వారి సేవలు అనే అంశంపై జిల్లాలోని వివిధ ఉర్దూ పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. విజేతలకు అదే రోజు బహుమతులిస్తామన్నారు.

తాగునీటికి కటకట


సున్నిపెంట ఫిల్టర్‌హౌస్


వ్యూపాయింట్ జీఎల్‌ఆర్ ట్యాంక్‌లో మోటార్లు దించుతున్న సిబ్బంది

- సున్నిపెంటలో 11రోజులుగా నిలిచిపోయిన నీటి సరఫరా
- అవస్థలు పడుతున్న ప్రజలు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో తాగునీటి సమస్య వేధిస్తోంది. వివిధ కారణాలతో 11రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జలవనరులశాఖ, రూరల్‌వాటర్ స్కీం వారు రెండు లైన్ల ద్వారా నీటిని సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ప్రతిసారి గ్రామంలో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. ఎప్పుడు నీరు వదులుతారో తెలియని పరిస్థితి. అవసరాలకు నీరు బయట కొనుగోలు చేయాలంటే 500 లీటర్ల ట్యాంక్ రూ.300 పలుకుతుంది. పేదలకు ఇంత మొత్తం చెల్లించడం భారంగా మారింది. తాగునీటి పథకంలో పనిచేసే రెగ్యులర్ సిబ్బంది పదవీవిరమణ చెందడం, వారి స్థానంలో కొత్త నియామకాలు జరగకపోవడం, దీనికితోడు తరచు మోటార్లు కాలిపోవడం తదితర కారణాలతో నీటిసరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

కొత్తమోటార్లు బిగిస్తున్నాం



నీటిపంపింగ్ వ్యవస్థలో ఇబ్బందులు ఉన్నాయి. అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం నియమించకపోవడంతో ఉన్నవాళ్లు అన్ని ప్రాంతాలకు నీటిని వదలలేక పోతున్నారు. వ్యూ పాయింట్‌లో మోటార్లు సక్రమంగా పని చేయడంలేదు. గత సోమవారం ఆ ట్యాంకును శుభ్రపరిచాం. 120 హెచ్‌పీ మోటార్లను బిగిస్తున్నాం. మరో రెండు రోజుల్లో పంపింగ్ మొదలవుతుంది.

– పక్కీరప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

తాగునీరు లేక అల్లాడుతున్నాం



ఇప్పటికీ మంచినీరు రాక 11 రోజులైంది. ఎప్పుడు నీళ్లు వస్తాయో తెలియని పరిస్థితి. అధికారులు కూడా ఏం చెప్పడం లేదు. పనిచేస్తే కానీ పూట గడవని మేము తాగేందుకు బయట నీళ్లు కొనాలంటే ఆర్థికంగా భారమవుతుంది. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– జి.సత్యవతి, స్థానికురాలు, సున్నిపెంట

పకడ్బందీగా స్కిల్ సెన్సెస్ సర్వే

నందికొట్కూరు: ప్రతి గ్రామంలో స్కిల్ సెన్సెస్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సెక్రటరీలకు స్కిల్ సెన్సెస్ జాబితాపై డిజిటల్ అసిస్టెంట్లు ఇమ్రాన్‌బాషా, నాయక్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య వయసు గల వారిలో ఎంత మంది చదువుకున్నారనే వివరాల జాబితాను త్వరగా రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

సంతజూటూరులో గ్రామసభ

బండి ఆత్మకూరు : నవంబర్ 1, 2 తేదీల్లో మండలంలోని సంతజూటూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు 125 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. భూ సంబంధ సమస్య ఉంటే తెలియజేయాలన్నారు.